ఆదివారం

ప్రజాశక్తి

మే 11, 2003



ఆడబిడ్డ అంతం సృష్టికే ప్రమాదం

హ్యాపీబర్త్‌డే

(11-5-2003 నుండి 17-5-2003 వరకు)

కె.లక్ష్మి
1సం॥, మే-2002
రమాదేవి-కొండలరావు
మెహిదీపట్నం-హైదరాబాద్

ఆర్తి
3సం॥, 11. 5. 2000
లత-రాములు
కవాడిగూడ-హైదరాబాద్



జె.వినీత్
1సం॥, 11. 5. 2002
సుజాత-కృష్ణ
ఇబ్రహీంపల్లి-రంగారెడ్డి

సాయికుమార్
4సం॥, మే-1999
పారిజాత- వెంకట్‌శెట్టి
పామాపురం-మహబూబ్‌నగర్

క్రాంతి
2సం॥, 12. 5. 2001
శాంతకుమారి- రామరాజు
విజయవాడ

కె. పవన్‌తేజ
2సం॥, మే-2001
రమాదేవి- రమేశ్
కొరటికల్- నల్లగొండ

జి.లక్ష్మీదేవి
2సం॥, 13. 5. 2001
భవాని- నాగబాబు
ఏలేశ్వరం-తూ॥గో

శివాని-సాయికృష్ణగౌడ్
5సం॥, మే-1998
3సం॥,మే-2000
మమత-జానయ్యగౌడ్
నకిరేకల్- నల్లగొండ

బి. తరుణశ్రీ
7సం॥, 14.5 .1996
నాగమణి-నాగరాజు
పూల్‌బాగ్‌కాలనీ-విజయనగరం

సమరసింహారెడ్డి
1సం॥, 16. 5 .2002
నీలిమ-భీమార్జున్‌రెడ్డి
విద్యానగర్-నల్లగొండ

ఎ.స్రవంతి
5సం॥, 16. 5.1998
మహాలక్ష్మి- సువర్ణరాజు
చీమకుర్తి- ప్రకాశం

కె. దివ్య
మే -16
లలిత- సోమేశ్వర్
పాలకుర్తి-వరంగల్

ఉజ్వల
2సం॥, మే- 2001
జయలక్ష్మి- చంద్రశేఖర్‌రెడ్డి
పామాపురం-మహబూబ్‌నగర్

...ు బంతి



...యే!

...గాలిలో నడిచే బంతిని
...ఇవాళ చూడండి మరి.
...తిలో తెల్లటి టేబుల్
...ందికదా. ఇది నేను
...ంటుంది. కావాలంటే
'ఏయ్ బంతీ! కుడి
... చేతిలోకి నడువు'.
...రా. ఎంచక్కా ఎడమ
...యింది. ఇదే ఇవాల్టి
...తగా ఆశ్చర్యపోతున్నారు?
... నడిచిందబ్బా?' అన్నదేకదా
... నేను చెప్తాగా! దీన్ని మీ
...చూపించొచ్చు. ఎలాగంటే....

మేజిక్! మేజిక్!!

...చేయాలంటే రెండంటే రెండే వస్తువులు కావాలి. అవేంటంటే ...తి, నల్లటి సన్నటి దారం. మేజిక్ డీలర్ దగ్గరకెళ్లి 'ఇన్‌విజిబుల్ ...స్తాడు. మొదట మన చేతుల మధ్య ఎంత దూరం వుండాలనేది ... అంతకు రెండింతల దారం తీసుకుని రెండు చివర్లు ముడి వేయాలి. ...ల మధ్యవేలికి తగిలించుకోవాలి. అప్పుడది వలయంలా ...నిమీద బంతి వదిలితే సులభంగా ఒక చేతిలోంచి మరో చేతిలోకి ... ప్రేక్షకులకు మేజిక్ దారం కనిపించకపోవడంతో బంతి తనంతట ...కుంటారు. మరి చేసి చూస్తారుగా.

కలం స్నేహం

పేరు:యం.ఆనంద్‌కుమార్,
వయసు : 14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు :క్రికెట్ చూడడం, చదవడం రాయడం.
పూర్తి చిరునామా : యం.ఆనంద్‌కుమార్, 9వ తరగతి, చిన్నపొర్ల , ఊట్కూర్, మహబూబ్‌నగర్.

పేరు: కె.మణి,
వయసు :15 సం॥
చదువు :10 వతరగతి
హాబీలు: ప్రజాశక్తి పేపరు చదవడం, టీవీ చూడడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : కె.మణి, దాటరాఫ్ కర్రా వెంకటేశ్వరరావు, యలమర్రు కండ్రిక, పెదపారుపూడి మండలం, కృష్ణా.

హాయ్... వేసవి సెలవలు వచ్చేశాయికదా. మీకు 'కలం స్నేహం' చేయాలని వుందా! అయితే ఓ కార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో ఒకటి ఆ కార్డు మీద అంటించి పోస్టు చేయండి.



కాకి తెలివి

ఓ గ్రామంలో టింగరి అనే కాకి వుంది. ఓ రోజు అది ఆహారం కోసం ఊరంతా వెతికింది. ఎక్కడా దొరకలా. చివరి ప్రయత్నంగా ఒక ఇంటి కుడితి తొట్టి దగ్గరకెళ్లింది. అక్కడ దానికి ఒక రొట్టె దొరికింది. టింగరి ఎంతో సంతోషంగా దాన్ని ముక్కున కరచుకుని వెళ్లింది. చక్కగా ఒక పెద్ద చెట్టుమీద వాలింది.

తుంటరి అనే నక్క ఇది చూచింది. ఎలాగైనా ఆ రొట్టెను సంపాదించాలనుకుంది. ఎంతో ప్రేమగా 'కాకిబావా కాకి బావా! నీ గొంతు బాగుంటుంది. ఓ పాట పాడవూ' అంది. అప్పుడు కాకి నోటిలో వున్న రొట్టె ముక్కను కాలికింద పెట్టుకుని చక్కగా పాడింది. అప్పుడు నక్క 'డాన్స్ చేయి బావా' అంది. కాకి రొట్టె ముక్కను నోట్లో పెట్టుకుని డాన్స్ చేసింది. 'ఈసారి పాట పాడుతూ డాన్స్ చేయి కాకి బావా' అంది నక్క అప్పుడు కాకి చక్కగా రొట్టె ముక్క తినేసి పాటపాడుతూ డాన్స్ చేసింది. పాపం నక్క తన పాచిక పారనందుకు నీరసంగా వెళ్లిపోయింది.

సిహెచ్. సురేష్,
7వ తరగతి,
నర్సరావుపేట.

> చిన్నారులూ...
> ఇవాళ మన నేస్తం సురేష్ రాసిన కథ ఎలా వుంది? మీకు నచ్చిందా! మరి మీరు కూడా సొంతగా కథ రాసి పంపిస్తే 'నా కథ' శీర్షికలో ప్రచురిస్తాం. పది వాక్యాల్లో రాయాలి. మీ కథలకోసం ఎదురుచూస్తూ.....
> బాలనేస్తాలు

...ే మండిపోతోంది మరి!



పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	కె	
	డ	
	పి	క
	ట	మి
	టు	

గతవారం జవాబులు

	చి	క్కు
		ట్టా
		దత
		రుత
		త్రం
		న్న

ఇంజనీరింగూ... ఇయర్‌రింగూ

✻ రుక్మిణి

"ఇంతకీ ఏం జరిగిందో చెప్పరాయె... ఏడు వారాల నగలు... ఏ.సి. కారూ ముందు నా బంగారు వడ్డాణం సంగతేందో...."

భార్యగారి వంక వచ్చబాబు రుసరుసలాడుతూ మింగేటట్లు చూసి కుర్చీలో కూలబడ్డాడు.

"బ్యాంకు డబ్బులూ... తోటల పైకం అంతా కలిపి 'దాని'కే తగలబెడితిరి. బ్రాంది షాపు పైకమంతా 'దాని'కే పాయె... సంబడం...!"

"అరె... జరనువ్వాగుతవా... అవతల సి.యం.గారు ఏదో ఒక 'రేటు' సెటిల్మెంటు చేసి పారేస్తానంటున్నాడు గద...." పచ్చబాబు చాలా మంద్రంగా అని మందహాసం ఓటి చేశాడు... ఎడ్డి మొహవా... ఇది ఇంజనీరింగు వ్యాపారం... స్టూడెంటు కుర్రాళ్ళు చేరతా వుంటే డబ్బో డబ్బు... అబ్బో... నీ కర్థం కాదులే..." నచ్చ చెప్పాడు.

'అర్థం కాదు నిజమే... ఇంజనీరింగు బడేగదా... పిల్లవాండ్ల ఫీజులే గదా... కట్టేది. అంతోసిదానికి అంత సంబడం ఎందుకో..." ఆవిడ లొడలొడ ఈసడించింది - బాబు చాలా జాలిగా ఆవిడ వంక చూశాడు.

"అదికాదే... అవతల మన చంద్రబాబుగారి 'వూదర' ఎంత పెరిగితే మనకు అంత గిరాకీ... అయిదారేండ్లుగా దావోస్ అనీ... లావోసనీ బడాబడా యాపారవేత్తల మీటింగులకు ఎందుకు మేం పంపిస్తున్నామో తెలుసా...?

ఆవిడకు నిజంగానే మూర్ఛవచ్చినంత పనయ్యింది - తిక్కదానిలా తెలీదని తల అడ్డదిడ్డంగా వూపేసింది.

"అక్కడ్నుంచి ఎవడెవడో బడా చోటా పెట్టుబడి వర్తకందార్లు మూటల మీద మూటలు సంచులే సంచులు పట్టుకుని విమానాల మీదా... లొటపిటల బిడారేసుకుని ఇక్కడ హైదరాబాద్‌లో ఏవో ఏవో ఫాక్టరీలు.. కార్ఖానాలు పెట్టి బోతుండివో" అని ఒకటే పబ్లిసిటీ చేసి పారేస్తున్నాం గదా.."

ఆవిడకు తిక్కరేగిపోయింది. మన ఇంజనీరింగు బడి గురించి చెప్పమంటే లావోస్.. లొటపిటలూ... బిడారాలంటాడేంటి? అదేం కుదర్దు.. ముందు నా ఏడు వారాల నగలూ... ఏ.సి. కారూ వడ్డాణం...

'వినుమరి' ఓ కసురు కసిరాడు పచ్చబాబు "అట్లా ఫాక్టరీలు... కార్ఖానాలు కడుతున్నారో" అని వూదర లేపితే జనం ఉద్యోగాల కోసం ఎగబడతారు - గదా - మరి ఉద్యోగం కావాల్నంటే ఇంజనీరింగో... టెక్నికో చదవాలి గదా... చదవాల్నంటే మరి కాలేజీలో చేరాలి గదా... కాలేజీలో చేరాలంటే మనం 'డొనేషన్లు' పుచ్చుకుంటాం గదా...

"డొనేషన్లా... విరాళాలా... ఏంటో"?

"నీకు సూటిగా చెప్తే గాని బుర్రకెక్కదు. మనం డొనేషన్లని 'బిచ్చం' అడగడం లేదు. సీటు రేటు ఇంత అని అమ్ముకుంటామన్నమాట... అబ్బో... మన కోటా కింద సీటుకు అర్వై వేలంటే... పదిహేను శాతం... మూడొందలకు నలభై అయిదు ఇంటూ అంటే ఇంటా



బయటా హెచ్చవేస్తే నలభై యాభై లచ్చలు... ఒక్క సంవత్సరానికి" ఆయనగారు లెక్కలు కట్టి పారేస్తున్నాడు. ఆవిడగారు ఆలోచనలో పడిపోయింది. ఇది బాగానే వుంది. ఏటా కాలుమీద కాలేసుకుని కూచుంటే అరకోటి...

"మరింక మరో యాభై సీట్లు విదేశాల్లోని మన దేశం కుర్రాళ్ళకి మూడు లక్షలకో సీటు... కోటీ యాభై లక్షలు... కోటీ యాభై....

ఆవిడ గారు మూడోసారి అనకముందే మూర్ఛలోకి జారుకుంది. బాబుగారు ఎడాపెడా విసుక్కుని గ్లాసెడు నీళ్ళు తెచ్చి మొహం మీద చిలకరించడంతో కాస్తంత తెప్పరిల్లింది.

"మరింక విదేశీ కుర్రాళ్ళకు ఎంసెట్... వైసెట్... జాన్తానై... ఇంటర్ పాసైతే చాలు... మన్లోమాట... (బాబు అటునిటు దొంగచూపులు చూశాడు) అసలు వాడు డొనేషను కట్టి విమానమెక్కి అమెరికా చెక్కేసినా ఫర్వాలేదు... వాడి సీటూ... స్వీటు గ్యారంటీ...

పచ్చబాబు మురిసిపోతుంటే ఆవిడగారు లెక్కలు గట్టలేక అలిసిపోతున్నంతలో సోమయ్య ఆదరాబాదరాగా అరుచుకుంటూ అరుదెంచిన వాడాయెను.

"బావోయ్... అక్కోయ్... మీరిద్దరూ కూచుని లెక్కలు గడుతున్నారా సరిపోయింది... అవతల కంప్యూటర్లు టకటకలాడించే హైటెక్ మొనగాండ్ల సంగతి చూస్తే నీ కోటి రూపాయల కాలేజీ ఖడేజావ్! వేస్ట్... వేస్ట్... సోమయ్య గబగబ అనేసి ఆయాసంగా కుర్చీలో కూలబడ్డాడు.

* * *

సోమయ్య - పచ్చబాబులు ఆదరాబాదరాగా పోలీసు స్టేషన్లోకి అడుగు పెట్టడంతో అక్కడి సీను యమ గంభీరంగా... సరదాగా వుంది. ముగ్గురు చాకుల్లాంటి కుర్రాళ్ళు... బరిసెలాంటి యస్సై గారితో పరాచికాలాడుతున్నట్లుగా వుంది... పోలీసులందరూ ముసిముసిగా నవ్వేస్తున్నారు.

"రండ్రండి బాబుగారూ.. కంప్యూటరు కుర్రాళ్ళు... మొత్తానికి మీకు బలే ఫిక్సింగు పెట్టేస్తుంటే పట్టుకున్నాను.." బరిసె యస్సై బలవంతంగా నవ్వడంతో బాబుగారి కడుపు మండిపోయింది.

"వివరం చెప్పకుండా విశేషాలెందుకయ్యా... ఏంటి కథా... ఆ కంప్యూటరేంటిటా...అసలు ఎవరు వీళ్ళంతా...!" బాబుగారు అసహనంగా అడిగాడు.

"మన కంప్యూటరింజనీరింగు కుర్రాళ్ళు... మహఫాస్టు... మీకు ఏ యూనివర్సిటీ సర్టిఫికెటు కావాలంటే... ఏ రకమైంది కావాలంటే అది... పది నిమిషాల్లో తయారు చేసి మీ చేతిలో పెడతారు. ఇంజనీరింగు... మెడిసిను... బి.ఇడి. ఎం.ఏ. అబ్బో... అసలు వీళ్ళ మెదడుకు మొక్కాల..

సోమయ్య దబ్బున విరుచుకుపడి.. తేరుకుని మూలుగుతూ ఉండిపోయాడు. "ఎట్లా... సర్టిఫికెట్లా... అదెట్లా... ఎవరు ఎవరికి... ఎట్టా...." బాబుగారు నోరంతా బార్లా తెరిచి వాళ్ళ వంక మిర్రిమిర్రి చూశాడు.

"ఏం లేదుసార్... సింపుల్... దీనికి ఎం. సెట్... క్యాసెట్ అవసరం లేదు. అసలు ఇంటరే.. పింటరే.. ఏమీ అక్కర్లేదు... అయిదువేలుగాని పారనూకితే ఇంజనీరింగు సర్టిఫికెటు పువ్వుల్లో పెట్టి మీ చేతిలో పెడతాం.... పోస్టులోనైనా ఫికర్ లేదు... టోకుగానైతే పదిశాతం డిస్కౌంటు...!"

బాబుగారు విరుచుకువడబోయి తమాయించుకున్నాడు... "ఎన్నాళ్ళ నుండి సాగుతుందీ యవారం..." తేరుకుని హీన స్వరంతో అన్నాడు.

"అబ్బే ప్రైవేటు కాలేజీలు... డొనేషన్లు... ఫీజులు... చదవడం... రాయడం... ఇదంతా వేస్ట్... అంతా చేసినా చేతికి వచ్చేది ఈ సర్టిఫికెటు కాగితవే గదా... ఏదో మా కాళ్ళ మీద మేం నిలబడాలనీ...

సోమయ్య బాబుగారు మటమట లాడుతూ బయటపడ్డారు!

* * *

'బావా వాళ్ళ యాపారం సుబ్బరంగా వుంది. అయిదువేలకో సర్టిఫికెటు... మన కాలేజీకి మంచి పోటీ...

"నోరు మూస్తావా గాడిదా... ఆ దొంగ సర్టిఫికెటు దేనికి పనికి వస్తుంది. ఉద్యోగం దానికి ఎవడిస్తాడ్రా... నీకు తలకాయగాని వుందారా!" బాబుగారు. "అబ్బో... సొక్కం... నీ ఇంజనీరింగు కాలేజీలో లక్షల డొనేషన్లు కట్టి చదివి పాసైనోడికి మహ ఉద్యోగాలు దొరికినట్లు... అవతల వేలవేల సీట్లు దిక్కూమొక్కూ లేక ఖాళీగా పడి మూలుగుతున్నవాయె!

ఈసారి పచ్చబాబుగారు నిజంగానే విరుచుకుపడిపోయాడు! ◆

మగాళ్ళ మేజిక్కులు

* లక్ష్మి

ప్రపంచ ప్రసిద్ధి చెందిన సర్కార్ మేజిక్కుమీద నాకు మక్కువ ఎక్కువ! ఆ మహానుభావుడు చేస్తున్న చమత్కారాలకు కళ్ళు చెదిరిపోతుంటాయి! అతనిదగ్గర ఆ విద్య నేర్చుకోవాలనే కుతూహలం కలుగుతుందిగానీ - ఆ పని అనుకున్నంత సులువుగా జరుగుతుందా? అసలీ మేజిక్కులు మగవాళ్ళు మాత్రమే చేస్తుంటారని నాకై నేనే సర్వే చేసి తెలుసుకున్నాను. ఈ విద్య ఇప్పటిదికాదు. శ్రీశ్రీశ్రీ ధర్మరాజు గారి కోరిక ప్రకారం మయుడనే గొప్ప ఆర్కిటెక్ట్ మయసభ పేరిట ఒక మహత్తరమైన మందిరం నిర్మించేడని పురాణాల్లో చదువుకున్నాం. అతను కేవలం ఆర్కిటెక్టు మాత్రమే కాదు. గొప్ప మెజీషియన్ కూడా నేమోనని నా డవుటు! అందుకే ఆ యొక్క మందిరంలో వున్నటువంటి సమస్తమైన సదుపాయాలూ మాయగా మహామాయగా వుండి - అతిధుల్ని అపారంగా ఆకర్షించేవిట!



ఉన్నవి లేనట్టూ, లేనివి వున్నట్టూ భ్రమ కలిగించడం ఆ నిర్మాణంలోని ప్రత్యేకత. కొలను కనిపిస్తుంది. జలకాలాడాలనే ఉత్సాహంతో బట్టలు విప్పి దూకితే - అది కొలను కాదు కేవలం రాతి ఫలకమని నడ్డివిరిగేక తెలుస్తుంది! పాలరాతి నేల కనిపిస్తుంది. ముచ్చటగా వుంది గదాని అడుగు వేస్తే అది మడుగవుతుంది! అడుగు పెట్టిన కారణంగా బుడుంగున మునిగిపోవడం జరుగుతుంది. అందమైన ద్వారమని అందులోకి షోగ్గా నడిస్తే అది గోడవుతుంది. గోడకి డేష్ కొట్టిన పాపానికి ముక్కు పచ్చడవుతుంది. లలానామణి అందంగా వుందిగదా పలుకెట్లుండునో వినవలెనని పలకరిస్తే సమాధానం రాదు. ధిక్కారమా అని చెయ్యి పట్టుకుంటే - కేవలం అదొక శిల్పమని తెలుస్తుంది. ఏతావాతా ఏది కొలనో, ఏది రాతి ఫలకమో, ఏది మడుగో అర్థం కాదు. ఏది ద్వారమో, ఏది గోడో పోల్చుకోడం కష్టమవుతుంది. అమ్మాయెవరో, బొమ్మెవరో తెలుసుకోడం తేలికైన పని కానేకాదు!

ఈ గొడవంతటికీ మూల పురుషుడైన ఆ మయుడు మహాశయునికి చేతులెత్తి దణ్ణం పెట్టాలి! సదరు మహాశయుడి వారసులే నేటి మెజీషియన్లని పట్టాభిరాంని చూస్తే తెలిసిపోతుంది. అతను ఖాళీ సంచిలో చెయ్యిపెట్టి పావురాళ్ళను తీస్తాడు. వాటరాఫ్ ఇండియా అంటూ మంత్రాలు చదివి - ఖాళీ జగ్గులోంచి నీళ్లు ఒలకపోస్తాడు. జగమే మాయ అంటాడు. ఆడిటోరియం నిండా మాయ నింపేస్తాడు. ఇంత మాయ చేస్తున్నవాడు మనల్నేం చేస్తాడోనని భయం కూడా కలుగుతుంది. అతన్తో వాళ్ళావిడ ఎట్లా నెగ్గుకు రాగలుగుతుందో కదా అని - ఆమెమీద జాలి పడుతుంటాం. వదిలేయండి!

ఎక్కడో ఒకటీ రెండు కేసులు మినహాయిస్తే - మేజిక్కులు చేసే మహానీయులంతా మగమారాజులే! వాళ్లకి వెన్నతో పెట్టిన విద్య - మేజిక్కు! ఆడవాళ్ళకి ఆ ఫీల్డులో అంత గొప్ప గిరాకీ లేదు. మాయలు చేయడం కంటె - మాయలో పడిపోవడం ఆడవారి నైజం! అందువల్ల మాయ చరిత్ర యావత్తూ మగవారి పరంగానే ఆదికాలం నుంచీ నడుస్తోంది. మెజీషియన్లనే బిరుదు ప్రత్యేకించి లేకపోయినా - మగమారాజులు ప్రతిరోజూ ఇంటా బయటా మేజిక్కులు చేస్తూనే వుంటారు. వెచ్చాలు నిండుకున్నాయి తీసుకురండని అర్ధాంగి ఇండెంటు పెట్టగానే - నా వంటి మీద చొక్కాలాగూలు తప్ప మరో విశేషం లేదంటాడు. ఆటో ఛార్జీలు నిన్నే అడుగుదామనుకుంటున్నానని కృంగిపోయి సమాధానం చెబ్తాడు. కావలిస్తే జేబులు తనిఖీ చేసుకోమంటాడు. తనిఖీ చేస్తే ఖాళీ సిగరెట్టు ప్యాకెట్ మాత్రమే దొరుకుతుంది!

ఖాళీ సిగరెట్టు పాకెట్టుని చూడగానే ఆవిడ విలవిల్లాడి పోతుంది. ఆర్థికంగా పతిదేవుడు పడిపోయినందుకు అల్లాడిపోతుంది. పిల్లల స్కూలు ఫీజులూ పుస్తకాల కోసం దాచుకున్న డబ్బుల్లోంచి ఏభైనోటు తీసి యిస్తూ ఆటో ఖర్చుల కోసం వాడుకోమని చెబుతుంది. ఆ నోటు పుచ్చుకుంటాడు. పట్టాభిరాంకి జైకొడతాడు. ఇల్లాలు చూడకుండా - గాల్లో చెయ్యూపి - దేవుడి పటం వెనకనుంచి వందకాగితం లాగుతాడు. మొత్తం నూటఏభై. సాయంత్రం ఖర్చుకి సరిపోతుందని చిద్విలాసంగా నవ్వుకుంటాడు. డబ్బుకోసం భార్యామణి భర్తగారి జేబులు వెతుక్కుంటుందేగాని దేవుడి పటం వెనక గాలించదు కదా! భర్త తగలేసే సిగరెట్టు పెట్టెలో కేవలం సిగరెట్లు మాత్రమే వుంటాయనుకుంటుందేగాని - సిగరెట్ల మధ్య నోట్లు కూడా నొక్కబడి వుంటాయని ఆ పిచ్చితల్లికేం తెలుసు?

భర్త వినిపించే విషాధగాథలకు కన్నీరు పెట్టుకుంటుందే తప్ప - అదంతా అప్పటికప్పుడు అతడు అల్లిన మాయాజాలమని ఆమెకెవరు చెబ్తారు? తలపగిలిపోతుంది కాఫీ పట్రమ్మంటాడు. ఆమె కాఫీ తయారీలో వుండగా - అతడు తెచ్చిన జీతంలో రెండు పచ్చనోట్లు పరుపు కింద తోసేస్తాడు. డజను పదినోట్లు దిండు గలీబులో దాచేస్తాడు. ఈలోగా ఆమె కాఫీ పట్టుకొస్తుంది! కాఫీ కప్పు తీసుకుని పర్సు ఆమె చేతికిస్తాడు. నెలంతా పొదుపుగా ఖర్చు చేయమని నీరసం నటిస్తూ ఆర్డరు వేస్తాడు. అతని నీరస నటనకి పడిపోతుందేగాని - జీతంలో మూడొందలు తగ్గినందుకు సంజాయిషీ అడగలేదు. తన చేతికిచ్చిందే మహాప్రసాదమనుకుంటుంది! పతిదేవుడి ఆరోగ్యం పదికాలాల పాటు బావుంటే అదే పదివేలనుకుంటుంది! ఆ విధంగా అనుగ్రహించమని కనకదుర్గమ్మని వేడుకుంటుంది! అంచేత మేజిక్కు షోలకి ప్రత్యేకించి హాజరవక్కర్లేదు. ప్రతి ఇంటా ప్రతిరోజూ పతిదేవుళ్ళు చేస్తున్న మేజిక్కుల ముందు - ఈ మేజిక్ షోలు ఆవ్వరాలేనని మనవి చేసుకుంటున్నాను! ◆

నిర్లక్ష్యం నీడలో కొండాపురం మ్యూజియం

* యాక భువనేశ్వరి

ప్రాచీన నాగరికతను, చారిత్రక గొప్పతనాన్ని రానున్న తరాలు తెలుసుకోవడానికి ఉన్న ఏకైకమార్గం పురావస్తు పరిశోధనే. పురాతన విశేషాలను గుర్తించడం ఒక ఎత్తయితే, వాటిని శోధించి, పరిరక్షించుకొని, అధ్యయనం చేయడానికి అన్ని వర్గాలకు అందుబాటులో ఉంచడం మరొక ఎత్తు. విదేశీయులు మన దేశంలో గుర్తించిన ప్రాచీన నాగరికతను సంరక్షించుకోవడానికి కూడా మన ప్రభుత్వాలకు శ్రద్ధ లేదని కొండాపూర్ మ్యూజియం నిర్వహణను చూస్తే అర్థం అవుతోంది. క్రీ.శ.1900 సంవత్సరంలో హెన్రీ కౌజెన్సు అనే విదేశీ పురాతత్త్వ శాస్త్రవేత్త అన్వేషణలో కొండాపూర్ ప్రాంతమున అనేక పురాతన అవశేషాలు వెలుగుచూశాయి. ఈ పురాతన అవశేషాలు మధ్యశిలాయుగము నాటివని తేలింది. వీటిని సంగారెడ్డి రెవెన్యూ డివిజనులోని కొండాపురం ప్రాంతం శాతవాహనుల కాలంలో ప్రముఖ వాణిజ్యకేంద్రంగా విరాజిల్లినట్లు పురాతత్త్వవేత్తలు ఊహిస్తున్నారు. కొండాపూర్ ప్రాంతమున ప్రాచీన ఆనవాళ్లు లభించిన ప్రదేశం కొండాపూర్, తెర్పోల్ గ్రామాల మధ్యన ఉంది.

ఈ ప్రాంతాన్ని పురాతత్వశాఖ తవ్వకాలకోసం 1940-42 ప్రాంతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. ఈ నిరంతర తవ్వకాలలో 1973-74 సంవత్సరంలో మరొక స్థూపపు దిబ్బను కనుగొని తవ్వకాలు జరిపారు.

శాతవాహనుల వాణిజ్యకేంద్రంగా కొండాపురం

ప్రతిష్ఠానపురం (నేటి పైఠాన్) రాజధానిగా చేసుకొని సువిశాల సామ్రాజ్యాన్ని నాలుగున్నర శతాబ్దాలపాటు పాలించిన శాతవాహనుల కాలంలో కొండాపూర్ విశిష్ట వాణిజ్యకేంద్రంగా విలసిల్లినట్లు తెలుస్తోంది. శాతవాహన చక్రవర్తులలో రెండో పులుమావి, గౌతమీ పుత్ర శాతకర్ణి తదితర ముఖ్యులు ఈ నగరాలనుండి పాలన కొనసాగించినట్టు అక్కడ లభించిన రాతికట్టడాలు, శిలాఫలకాలు తెలియచేస్తున్నాయి.

మాతృదేవత

సాంప్రదాయమైన వంకీల జుట్టు, చప్పిడిముక్కు, పెద్ద పెదవులు, గుండ్రని ముఖముతో తయారుచేయబడిన స్త్రీ ప్రతిమ ఈ తవ్వకాలలో బయల్పడింది. ఈ ప్రతిమను మాతృదేవతగా ఆ కాలంలో పూజించినట్లు చరిత్రకారులు ఊహిస్తున్నారు. మిగిలిన బొమ్మలకున్న పాపిటబిళ్ల, కంఠ హారముల వంటివి ఈ మాతృదేవత ప్రతిమకు లేకపోవటం కూడా ఆమెకు ఇచ్చిన పవిత్రతను, ప్రాధాన్యతను వెల్లడిస్తుందని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ ప్రత్యేక లక్షణాలున్న స్త్రీని ఉత్పాదకతకు ప్రతిరూపంగా భావించి అప్పటి ప్రజలు పూజించినట్లు చరిత్రకారులు చెప్తున్నారు. ఇలాంటి లక్షణాలున్న మరికొన్ని శాతవాహనుల కాలం నాటి ప్రతిమలు నాగార్జునకొండ (నాగార్జునసాగర్) ప్రాంతంలో లభించినట్లు వారు ఉదహరిస్తున్నారు. ఈ ప్రతిమలన్నీ మెత్తని మట్టితో తయారు చేసి కాల్చకముందే ఎరుపురంగు పూత పూయబడిన గట్టిబొమ్మలు. ఇవి ప్రస్తుతం కొండాపూర్ మ్యూజియంలో దర్శనమిస్తాయి.

మట్టిపాత్రలు

కొండాపూర్ తవ్వకాలలో గృహోపకరణాలైన మట్టి పాత్రలు దొరికాయి. వీరి యందు రంగు పాత్రలు, దీపపు సెమ్మలు, పళ్లాలు, మూకుళ్ళు తదితర వస్తుసామాగ్రి లభించింది. వీటి తయారీలోని హస్తకళా ప్రావీణ్యము ఎన్నదగినది. చిన్న మట్టి పాత్రల నిర్మాణము 45 సెం.మీల నుండి 50 సె.మీ వృత్త 17



సెం.మీ ల ఎత్తుతో జరిగింది. 74 సెం.మీ. వృత్తంగా 92 సెం.మీ ఎత్తుతో పెద్దపాత్రలు చేశారు. బౌద్ధులు పవిత్రంగా భావించే త్రిరత్నము, తామర పుష్పం, ధర్మచక్రముల చిహ్నాముల వంటివి ఇతర పాత్రల మీద ముద్రించబడినవి. వీటితో పాటు అనేక రకాలైన మట్టిపాత్రలు ఈ మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. ఈ మట్టిపాత్రలు అన్నింటిపై ఎరుపు రంగు పూత ఉండగా వీటి మందంలో తేడాలున్నాయి.

ఆభరణాలు

కొండాపూర్‌లో జరిపిన తవ్వకాల్లో నాటి ప్రజలు ధరించిన ఆభరణాలు కూడా లభించాయి. వీటిలో కంకణాల ముక్కలు, చేతిగోరుతో గీయబడిన చిత్రాలు గల తాయెత్తులు ఉన్నాయి. గవ్వ, రాగి, గాజు పదార్థాలతో తయారు చేసిన కంకణాలు కూడా ఉన్నాయి. రోమను నాణాలకు అనుకరణలుగా కాల్చిన మట్టి పతకాలు కంఠాభరణాలుగా ఉపయోగించేవారని తెలుస్తోంది. విభిన్న ఆకృతులు, పరిమాణాలు కలిగిన కెంపు స్ఫటికశిల, పద్మరాగము, మరకతము, వైఢూర్యములు, గవ్వ, ఎముక, గాజు తదితర పదార్థాలతో తయారయిన పూసలు కంఠహారంగా ధరించినట్లు భావిస్తున్న ఆభరణాలు నేడు ఈ ప్రదర్శనశాలలో ఉన్నాయి. బంగారు పూత పూయు విధానము రోమను దేశంలో అప్పటికే పరిపూర్ణతను సాధించుకున్నట్లు వీటి పనితనాన్ని బట్టి తెలుస్తోంది. ఆ ప్రాంతంలో కొందరు వ్యవసాయ అవసరాలకోసం జరిపిన తవ్వకాలలో కొన్ని శిల్ప ఖండాలు లభ్యమయ్యాయి. ఎముకతో చేయబడిన పాచికలు, పెద్ద పెద్ద ఇటుకలు, రంధ్రములు గల పెంకులు, కల్వపురాళ్లు, వాటిని పదునుపెట్టే రాళ్లు తదితర ప్రాచీన వస్తువులు ఈ తవ్వకాలలో లభ్యమయ్యాయి. రోమను చక్రవర్తి పోన్‌టిఫ్ ఆగస్టస్(క్రీ.పూ. 37నుండి క్రీ.శ. 14 వరకు) రూపము ముద్రించబడిన బంగారు పూతగల నాణాలు అక్కడి తవ్వకాలలో బయటపడినాయి. వివిధ రకాల పళ్లెములు, ధాన్యము నిల్వ చేసే పెద్ద పెద్ద బోషాణాలు కూడా ఈ ప్రదర్శనశాలలో ఉన్నాయి. ఈ చరిత్ర అన్వేషణ అంతా 1975కు ముందే కావడం ఇక్కడ చెప్పుకోవలసిన అంశం. నిర్వహణకు నిధులు సమకూర్చడానికి ప్రభుత్వాలు అపసోపాలు పడుతున్నాయి. ◆

అభిమానుల ఆశలు నెరవేరేనా ?

దాల్మియా

తౌకీర్ జియా

*** రాంప్రసాద్.ఎం.కె.**

రాజకీయాలతో క్రికెట్‌ను ముడిపెట్టడం క్రీడల అభివృద్ధికి అవరోధంగా నిలుస్తుంది. రాజకీయాలకు ఎల్లలు ఉండరాదు. ముఖ్యంగా ఇరుగుపొరుగు దేశాల మధ్య క్రీడా సంబంధాలకు రాజకీయ సమస్యలు ప్రతిబంధకంగా ఉండరాదు. ఈ విషయం అర్థం చేసుకోలేని కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉగ్రవాదానికి పాకిస్తాన్ ఊతం ఇస్తోందనే కారణంతో పాకిస్తాన్‌తో క్రీడా సంబంధాలకు అడ్డుకట్ట వేసింది. ప్రపంచ వ్యాపితంగా ఎంతగా విజ్ఞప్తులు వచ్చినప్పటికీ పట్టించుకోని ప్రభుత్వం తన వైఖరికి కట్టుబడి నిలిచింది. అంతర్జాతీయ టోర్నమెంట్లలో రెండు జట్లు పాల్గొనేందుకు అనుమతించింది. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన వరల్డ్‌కప్‌లో రెండు దేశాల క్రికెట్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత్ అన్ని రంగాల్లో ఆధిక్యత ప్రదర్శించి పాకిస్తాన్‌ను సునాయాసంగా ఓడించింది. వరల్డ్‌కప్‌లో భారత్ ఇతర మ్యాచ్‌ల్లో కూడా అదే విధంగా ఘన విజయం సాధించినప్పటికీ అంతగా పట్టించుకోని వారు పాకిస్తాన్ మీద విజయం సాధించేసరికి ఎనలేని ప్రాముఖ్యత నిచ్చారు.

ఈ విజయం సాధించిన భారత జట్టును అభినందిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం కూడా చేశారు. మరికొందరు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత రత్న ఇవ్వాలని సూచించారు కూడా. ఈ సంగతి అటుంచితే ఇరు దేశాల మధ్య తిరిగి ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ కోరడంతో కదలిక ప్రారంభమైంది. భారత్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షులు దుబాయ్‌లో ఆసియా క్రికెట్ ఫెడరేషన్ సమావేశం సందర్భంగా భేటీ అయ్యారు. చర్చల తీరుపట్ల బిసిసిఐ అధ్యక్షుడు జగ్‌మోహన్ దాల్మియా, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తౌకిర్ జియా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాల్సింది భారత ప్రభుత్వమేనని దాల్మియా పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు తిరిగి ప్రారంభం కాగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ దిశగా బిసిసిఐ తీసుకుంటున్న చర్యల పట్ల జియా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ దిశగా రెండు దేశాల క్రికెట్ బోర్డులు సానుకూలంగా వ్యవహరించడం ప్రారంభించాయి. ఇంతకుముందు ఆసియా కప్‌లో పాల్గొనబోనని ప్రకటించిన పాకిస్తాన్ తన వైఖరి మార్చుకుని తాజాగా పాల్గొనాలని నిర్ణయించింది. ఈ టోర్నమెంట్ వచ్చే ఏడు ఏప్రిల్‌లో జరిగే అవకాశం ఉంది. ఆసియాకప్‌లో పాల్గొనడంపై భారత్ ఇంతకుముందు అనుమానాలు పొడచూపాయి. తాజాగా భారత్ పాల్గొనగలనని ప్రకటించింది. దీంతో రెండు ప్రధాన జట్లు పాల్గొనబోతుండటంతో ఈ టోర్నమెంట్‌పై ఆసక్తి పెరిగింది. ఇది క్రికెట్ క్రీడకు శుభపరిణామమేనని చెప్పాలి.

పాకిస్తాన్ మరో అడుగు ముందుకు వేసి భారత జట్టును తమ దేశంలో పర్యటనకు ఆహ్వానించనున్నట్లు ప్రకటించింది. ఇది కూడా నిజంగా మంచి పరిణామమే. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు ఇటువంటి చర్యలు మార్గం సుగమం చేస్తాయి. ఈ విషయమై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సింది ఇక భారత ప్రభుత్వమే. రెండు దేశాల మధ్య క్రీడా సంబంధాలు విచ్ఛిన్నం కావడంతో ముఖ్యంగా క్రికెట్ అభిమానులు ఎంతో కోల్పోయారు. రెండు దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ ఎంతో ఆసక్తిని రేకెత్తించడం సహజం. ఓడిపోతామనే భయంతోనే తమతో క్రికెట్ ఆడేందుకు భారత జట్టు తటపటాయిస్తోందని పాక్ జట్టులో సీనియర్ క్రికెటర్ వసీం అక్రం ఆ మధ్య వ్యాఖ్యానించాడు. ఇతర అంశాలతో క్రీడలను ముడిపెడితే ఇటువంటి వ్యాఖ్యలు రావడం సహజం. వీటిపై ప్రతి వ్యాఖ్యలు చేయడం కూడా అనవసరం. ఇది ఇంతకుముందు నిజమేమో కానీ భారత జట్టులో యువరక్తం ప్రవేశించిన తరువాత పరిస్థితి మారిపోయింది. ఒత్తిడిని తట్టుకుని భారత జట్టు రాణించగలుగుతోంది. వరల్డ్‌కప్ ఇందుకు నిదర్శనం. పాకిస్తాన్ ముందుగా బ్యాటింగ్ చేసి భారీ లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ భారత్ సునాయాసంగా ఛేదించింది. అలాగే న్యూజిలాండ్, ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లు కూడా భారత జట్టు సత్తాను చాటాయి. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు భారత్‌కు ఒక షరతు విధించింది. తమ దేశంలో పర్యటించాలని, దీని తర్వాతే భారత జట్టుతో మ్యాచ్‌ల విషయం ఆలోచిస్తామని జియా పేర్కొన్నారు. ఇందులో అనౌచిత్యం ఏమీ లేదనే చెప్పాలి. క్రికెట్ సంబంధాలకు స్వస్తి చెప్పింది భారతే కనుక తిరిగి అదే విధంగా సాధారణ సంబంధాల పునరుద్ధరణకు చొరవచూపడం అవసరం. మరోవైపు పాకిస్తాన్‌తో సాధారణ సంబంధాల పునరుద్ధరణకు ఇరు దేశాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో రెండు దేశాలు ఏ మేరకు పురోగతి సాధిస్తాయో చూడాలి. క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు భారత ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గం ఈ దిశగా నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మిగిలిన విషయాల్లో పురోగతి ఎలా ఉన్నా క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు అవరోధం కారాదు. ఈ విషయమై భారత ప్రభుత్వం తీసుకునే సరైన నిర్ణయం కోసం క్రికెట్ జగత్తు అంతా ఎదురుచూస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ◆

కథ

✻ మొలకలపల్లి కోటేశ్వరరావు

హోరుమని చెవులు చిల్లులు పడేలా పడమరగాలి కొడుతోంది. గాలి ధాటికి పెద్దపెద్ద చెట్లు ఉయ్యాల ఊగుతున్నాయి.

ఆకాశంలో ఎక్కడా పిట్ట లేదు. నేలమీద సైతం కనుచూపు మేర ప్రాణి జాడలేదు.

రోళ్ళు కూడా బద్దలయ్యే రోహిణికార్తె ఎండలు మలమల మాడిపోతున్నాయి.

"ఈగాల్లో పిల్లోడికి బెట్టదెబ్బ తగిలిద్దేమొ! కొద్దిగా సద్దిబువ్వన్నా తాగిపోరా అంటే పరగడుపుతోనే పోయాడు. పొద్దుకూడా తిరిగిపోయింది. తొందరగా వస్తే బాగుండు!" అనుకుంటూ ఎలిశమ్మ గుడిసెలో నించి బయటకు వచ్చి దారి చివర, చూపు పడిన వరకూ చూసింది.

కొడుకే కాదు, మనిషి జాడ కూడా ఎక్కడా లేదు.

"ఏందప్పా... జేమ్సు కోసం చూస్తండా! వస్తాడ్లే అప్పా! కాయలు అమ్ముడు పోవద్దా, రావద్దా? అంత గత్తర పడితే ఎట్ట?" అంది పొరుగు గుడిసె సువార్త.

"గత్తర కాదెమ్మె! ఏందిని బోలా! ఉల్లిగడ్డ నంజుకుని సద్దిబువ్వతాగిపోరా అంటే పొద్దున్నే ఏం తాగేదే అంటా పోయాడు. గాడుపుల రోజులాయె!"

"అక్కడ టిపినీ చేస్తాడ్లే అప్పా! ఏం తెలవనోడా ఆకలికి మాడతాడేమో అనుకోటానికి! ఆకలయితే తింటాడ్లే ఏదో ఒకటి!"

"ఆకలికయినా మాడతాడు కానీ ఈడు అట్టతినేవోడు కాదమ్మె! టిపినీ చేస్తే నాలుగు రూపాయలు కర్చవతయ్యని బయం! చూస్తాచూస్తా రూపాయి కర్చు పెట్టడు. ఉత్తజిగినోడమ్మె! వాడి కడుపు కన్నా వాడు తినొచ్చు కదా, ఎవురికన్నా పెడుతన్నాడూ?"

"అట్ట అనవాకులే అప్పా! జేమ్సు చదువుకున్నోడూ, తెలివికలిగినోడు! కష్టం సుకం, మంచిసెబ్బరా తెల్సినోడు! అవసరం లేకపోయినా వూరకనే డబ్బు ఎందుకు కర్చు పెట్టుకోవాల? చేతిలో డబ్బు రూపాయి జారిపోతే తిరిగి వచ్చిద్దీ? మావూళ్ళో మా చిన్నయ్య కొడుకు ఒకడు వుండాడు. పదో తరగతి రెండుసార్లు తప్పాడు. వాడికి డబ్బంటే లెక్కా జమా లేదు. పది రూపాయలు అంటే వాడికి రూపాయితో సమానం. అన్నీ వుండ విస్తర అణిగిమణిగి వుండిద్దనీ... తెలివి కలవాళ్ళ తీరే వేరు అప్పా!" అంది సువార్త జేమ్సుని మెచ్చుకుంటూ.

"ఏం తెలివో, ఏందోలెమ్మ! తెలివి కలిగినోడయితే ఉజ్జోగం ఏదీ? ఇప్పటికి సదువు అయ్యి మూడేళ్ళయ్యింది. మూడేళ్ళ బట్టి వూరకనే వుండాడుగా కాయలు అమ్ముతానో, కూలికి నాలికి పోతానో పయివేటు బళ్ళలో చదువు చెప్పుకుంటానో! బిడ్డ ఎం కష్టపడతండాడో, ఎన్ని బాధలు పడతండాడో మాక తెలుసు!" అంది ఎలిశమ్మ విచారంగా.

"నేను చూట్టం లేదంటప్పా! నాకు మాత్ర తెలవదా జేమ్సు ఎంత బాధ పడతండాడో!"

"ఈడితోటి చదువుకున్నోళ్ళు అమెరిక అంట, ఆ దేశం ఇంకా ఎయ్యెయెయ్యి దేశాల పోయారంట! కొంతమందికి నెలకి నలబయ్యేలూ, ఏబయ్యేలూ జీతాలంట! ఈడికే నమ్మె ఏ దారీతెన్నూ కనపడంది!"

"మంచి వాళ్ళకేనప్పా కష్టాలూ బాధలూ!"

విపక్ష

వీళ్ళు ఇలా మాటల్లో వుండగానే జేమ్సు సైకిల్ నడిపించుకుంటూ వచ్చాడు.

"ఏందయ్యా, పొద్దుతిరిగిందాకా వుండావు? కాసినీ కూసినీ కాయలు మిగిల్తే మ్ముకోకూడదూ?"

"కాయలు ఎప్పుడో అమ్ముడు పోయినయ్యే! దార్లో సైకిలుకి పంచరు అయింది. అక్కడ నించి ్చుకుంటా వచ్చా!"

"సరేలే... ముందు కాళ్ళూ చేతులూ కడుక్కో ండతా!"

జేమ్సు సైకిలు గుడిసె ముందు పందిరి పెట్టి కాళ్ళూ చేతులూ కడుక్కుని వెళ్ళి అన్నం తంటూ అడిగాడు. "ఇయ్యాల నువ్వు పనికి పోలేదంటే?"

"సుబ్బయ్య వాళ్ళ చేలో పుల్లలు

ఏరివచ్చాం. ఎండలుగా, ఎంతసేపు చేస్తాం! పన్నెండు గంటల కల్లా తిరిగి వచ్చాం!"

"అయితే పూటకూలి కట్టి ఇస్తాడా ఏంది?"

"పూటపని ఎందుకు అయిద్దిరా? రోజు పనేగా! ఆ వార పొద్దున్నే పెందలకడపోలా? మేం చేలోకి పొయ్యేసరికి పొద్దుగూడా పొడవలా!"

"అయ్య ఏం పనికి పోయాడు?"

"మొద్దులు తవ్వడానికి పోయాడు. ఎండబడి పోయేరట్టుగా వుంది ఇయ్యాల. లేకపోతే ఈపాటికి రావాల!" అంది ఏలిశమ్మ.

జేమ్సు మాటల్లోనే అన్నం తిని గుడిసెలో ఒక మూలగా వున్న ట్రంక్ పెట్టె తెరిచాడు. అందులో తనకి అవసరమైన ఇంజినీరింగ్ బుక్కూ, ఇంగ్లీష్ గ్రామర్ బుక్కూ, ఇతర బుక్కు కొన్నీ వున్నాయి.

పెట్టె అడుగున మీడియం సైజ్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ వుంది. అది తనకి టెంత్‌లో స్కూల్ ఫస్ట్ వచ్చినందుకు బహుమతిగా వచ్చింది. అది బయటికి తీశాడు.

అందులో ఒక కవరులో దాచిపెట్టుకున్న డబ్బు తీసి లెక్కపెట్టాడు. అన్నీ వందరూపాయల కాగితాలూ, యాభైరూపాయల కాగితాలూ! 2850 రూపాయలు వున్నాయి.

ఆ రోజు కాయలు అమ్మితే వచ్చిన డబ్బు చూశాడు. నాలుగు వందలూ, కొంత చిల్లరా వున్నాయి. కాయల కొనుగోలు ఖర్చు పోతే 60, 70 రూపాయల ఆదాయం వుండొచ్చు. జేబులో డబ్బు 50 రూపాయలు తీసి ఆ కవరులో పెట్టాడు. మొత్తం 29 వందలు అయ్యాయి.

ఇంకా 11 వందలు సంపాదించి తను హైదరాబాద్ వెళ్ళాలి.

భార్య కాన్పుకి పుట్టింటికి పోయింది. భార్యకి ఐదు వందలు ఇస్తే ఖర్చులకి వాడుకుంటుంది.

మేనమామ కూతురు. వాళ్ళూ ఏం లేని వాళ్ళే! కూలీనాలీ చేసుకుంటూ రెక్కల కష్టం మీద బతికే వాళ్లు.

తను తొందర పడి పెళ్ళి చేసుకున్నాడు. అమ్మా అయ్యా ఒత్తిడి వల్లనే పెళ్ళికి ఒప్పుకోవాల్సి వచ్చింది.

చిన్నదో, పెద్దదో ఒక జాబ్ సంపాదించుకునే వరకూ పెళ్ళి చేసుకోకుండా వుండాల్సింది. తను దూర కంతలేదు. మెడకోడోలు అన్నట్లు వుంది వ్యవహారం.

భార్యని వదిలిపెట్టి తను నెలల తరబడీ హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం తిరగలేదు. తను ఈ పల్లెటూళ్ళో వుంటే ఉద్యోగం దొరికే అవకాశం లేదు. చిన్న ఉద్యోగం అయితే ఆ మహానగరంలో కాపురం పెట్టి జరపలేదు. ఎటూకాకుండా వుంది.

తను రెండుసార్లు హైదరాబాద్ వెళ్ళాడు. మొదట్లో నాలుగు నెలలు కాలికి బలపం కట్టుకుని తెల్సిన వాళ్ళ దగ్గరికీ, యాడ్ వచ్చిన కంపెనీల చుట్టూ తిరిగాడు. 15 వందలజీతంతో ఒక ఉద్యోగం దొరికింది. జీతం తక్కువతో పాటు మేనేజర్ వేధింపుల్ని భరించలేక రెండు నెలలు చేసి విసుగు పుట్టి మానుకుని వచ్చాడు.

కొంతకాలం ఆగి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు. ప్రయోజనం కనబడలేదు.

ఈసారి వెళ్ళి గట్టి పట్టుదలతో ఉద్యోగం సాధించాలి.

తను చదువులో మెరిట్. ఎప్పుడూ ఫస్ట్‌క్లాసులూ, డిస్టింక్షన్లూ తప్ప తనకి సెకండ్ క్లాస్ సైతం ఎప్పుడూ రాలేదు. తనకంటే చదువులో ఎంతో వెనుకబడి వుండే వాళ్ళు, అసలు బొత్తిగా చదువు లేకుండా ఎలాగో అతికష్టం మీద పాసయిన వాళ్ళూ మంచి ఉద్యోగాల్లో సెటిలయ్యారు. మరి తనకి ఎందుకు ఉద్యోగం దొరకడం లేదో అర్థం కావడం లేదు.

"నీకేదో ఉత్తరం వచ్చిందబ్బియ్యా! టపా అబ్బాయి తెచ్చిచ్చాడు!" పందిరి చూరులో దోపిన ఎన్వలప్ కవర్ ఇచ్చింది ఎలిశమ్మ.

అది ఫ్రెండ్ చిరంజీవి నించి వచ్చిన ఉత్తరం.

వారం రోజుల క్రితం అతనికి తాను రాసిన ఉత్తరానికి రిప్లయ్ ఇది. తను కొద్ది రోజుల్లో హైద్రాబాద్ వస్తున్నట్లూ, రూంలో తను ఉండటానికి అవకాశం కల్పించమనీ, ఈ మధ్యలో ఎప్పుడైనా ఖాళీలు పడి ఉన్నట్లయితే కటింగ్స్ తీసి దాచిపెడితే వచ్చిన తరువాత ప్రయత్నిస్తానని తను రాసిన ఉత్తరానికి జవాబు ఇది.

తీసి చదివాడు జేమ్స్.

"జేమ్స్... నువ్వు ఎప్పుడైనా ఇక్కడికి రావచ్చు. నిజానికి మా రూంలో ఖాళీ కొద్దిగా కూడా లేదు. చిన్నగది. ముగ్గురం వుంటున్నాం. నువ్వు కూడా వస్తే నలుగురం ఎలాగో ఎడ్జెస్ట్ అవుదాం. మా రూమ్మేట్స్ అందరూ మంచివాళ్ళే! ఎడ్జెస్ట్ కావచ్చు. వండుకోవడం, తినడం! సెల్ఫ్ ప్రిపెరేషన్! రోజుకు ఒకరివంతు! ఇది రాజధాని నగరం+పారిశ్రామిక నగరం! ఇక్కడ ఫ్యాక్టరీలూ, ఆఫీసులూ, కార్పొరేట్ సంస్థలూ, కంప్యూటర్ సంస్థలూ ఉండటానికి చాలానే వున్నాయి. ఉద్యోగాలే లేవు! ఇంజనీరింగ్ చదివి వెయ్యి రూపాయలకి జాబ్ చేస్తున్న వాళ్ళు చాలా మంది వున్నారు ఇక్కడ. గతంలో నీకు కూడా ఎక్స్‌పీరియన్స్ కదా! అయితే మనం నెగిటివ్ కోణమే చూడకూడదు. పాజిటివ్‌గా చూస్తే ఇంజనీరింగ్ చదివి నెలకి 50 వేల రూపాయల ఉద్యోగం చేసే వాళ్ళు కూడా చాలా మందే వున్నారు. సరే ఏదైనా ఉద్యోగం దొరకడం మాత్రం అంత తేలిక కాదు. గట్టిగా ప్రయత్నిస్తే దొరక్కుండా కూడా పోదు. కష్టపడే వాడికి అవకాశాలు వుంటాయంటారు. భవిష్యత్ మనదే! వెంటనే రా!

చిరంజీవీ, తనూ ఇంటర్మీడియెట్‌లో క్లాస్‌మేట్స్. అతనిది పొరుగూరే! మంచి స్వభావం కలిగిన వాడు స్నేహ ప్రియుడు. వాళ్ళది మధ్య తరగతి కుటుంబం.

ఇంటర్ అయిన తరువాత బి.ఎస్సీ పూర్తిచేసి ఒక కెమికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

తనకి టెంత్ క్లాస్‌లో 534 మార్కులు వచ్చాయి. అప్పుడు అవే మంచి మార్కులు.

ఆ మార్కులు రావడంతో ఒంగోలులోని ఒక ప్రైవేట్ రెసిడెన్షియల్ కాలేజీలో తనికి ఫ్రీగా మెస్‌తో పాటు అన్ని వసతులూ కల్పించి ఇంటర్ చెపుతామనడంతో తను ఆ కాలేజీలో చేరాడు.

అక్కడే తనకి చిరంజీవి పరిచయం. క్లాస్‌మేటే కాదు, రూమ్మేటు కూడా!

రూమ్మేట్ అని పేరే కానీ రూంలో ఎప్పుడూ ఉన్నది లేదు. ఎప్పుడూ కాలేజీలోనే, స్టడీ అవర్స్‌లోనే!

అతను కష్టపడి చదివేవాడు కానీ గుర్తు తక్కువగా వుండేది. క్లాసులో అర్థంకాని విషయాలు తను విడమరిచి చెప్పేవాడు.

ఇంటర్‌లో తనతో చదువుకునే కొంతమంది పిల్లలకి కుల అహంకారం, అగ్రకులం అనే మిడిసిపాటు ఉండేది కానీ చిరంజీవికి అలాంటి ఫీలింగ్ లేదు.

సెలవుల్లో వచ్చినప్పుడు ఈ వూరికి తన కోసం వచ్చి తమ ఇంట్లో అన్నం తినే వాడు. వాళ్ళ వూరు వెళ్తే వాళ్ళ అమ్మ వాళ్ళ పళ్ళెంలోనే తనకి భోజనం పెట్టేది.

ఇంటర్ అయిపోయి అతను బిఎస్సీకీ, తను అనంతపురం ఇంజనీరింగ్‌కీ వెళ్ళినా తమ మధ్య స్నేహం చెదరలేదు.

సెలవులు వస్తే అతను ఈ వూరికి రావడం, తను వాళ్ళ వూరికి వెళ్ళడం, ఉత్తరాలు రాసుకోవడం స్నేహం కొనసాగుతూనే ఉంది.

అతనికి చిన్న ఉద్యోగం. కొంచెం పెద్ద ఉద్యోగమై మంచి జీతం తీసుకుంటున్నా తనకి ఉద్యోగాన్వేషణలోనూ, ఇతరత్రా సాయపడి ఉండేవాడు.

హైదరాబాద్‌లో ఖర్చు అంటే మామూలు కాదు.

సిటీబస్ ఛార్జీలకే రోజూ బోలెడు డబ్బు పోయాలి. ఒకచోటు నించి మరో చోటుకి వెళ్ళడానికి అవి నడిచే దూరాలు కావు.

ఎంత జాగ్రత్తగా, ఎంతపొదుపుగా వున్నా రోజూ 50, 60 రూపాయల ఖర్చు అవుతుంది. కలిగిన వాళ్ళ పిల్లలకయితే ఇంటి దగ్గర నుంచి డబ్బు వస్తుంది. అవి పెట్టుకుని నెలల తరబడి వుండీ, కంప్యూటర్ కోర్సులు నేర్చుకునీ సులభంగా ఉద్యోగం సంపాదించుకోగలుగుతున్నారు.

తనకి ఇంటి దగ్గర నించి పైసా వచ్చే పరిస్థితి లేదు.

చదువుకునే రోజుల్లో కూడా తన పరిస్థితి ఇంతే. ఇంటి దగ్గర అమ్మా అయ్యా తనకి అన్నం పెట్టడమే గొప్ప విషయం.

అమ్మా అయ్యకి వచ్చే కూలి తిండికే బొటాబొటిగా సరిపోతుంది. ఇక అందులో మిగల్చడం, పిల్లలకి చదువులు చెప్పించడం జరిగే పనికాదు.

పల్లెలోని తన ఈడు పిల్లలందరూ పనులకి పోయి సంపాదించి తెచ్చే వాళ్ళే! తను కూడా హైస్కూల్లో

చదువుకునే రోజుల్లో సెలవు వస్తే అమ్మ వెంట కలుపులకో, పత్తి తీతలకో, మిరపకాయ కోతలకో ఏదో ఒక పనికి వెళ్ళేవాడు. పుస్తకాలు కానీ, పెన్నులు కానీ తన కూలి డబ్బులతోనే సంపాదించుకుని చదువుకున్నాడు.

పల్లె మొత్తం మీద ఇంజనీరింగ్ కోర్స్ చదువుకున్నది తను ఒక్కడే! అసలు చదువుకున్న వాళ్ళే తక్కువ!

వీలైనంత తొందరగా హైద్రాబాద్ వెళ్ళాలి. ఏదో ఒక ఫ్యాక్టరీలోనో, కంపెనీలోనో ఒక ఉద్యోగం సంపాదించుకుంటేనే తనకి మనుగడ! ఈ ఊళ్ళో ఎన్ని సంవత్సరాలు ఉన్నా ఉద్యోగం వచ్చే అవకాశం లేదు.

ఇంతకుముందు కొన్ని ఉద్యోగాలకి ఖాళీలు ప్రకటించి టెస్టులూ, ఇంటర్వ్యూలు జరిపి ఉద్యోగాలు ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలే పడటం లేదు. అన్నీ ప్రైవేటు ఉద్యోగాలే!

కొరవ డబ్బు తొందరగా సమకూర్చుకోవాలి.

రెండు మూడు వేలు డబ్బు తీసుకుని వెళ్ళి ఉద్యోగం సంపాదించుకున్న తరువాత నెమ్మదిగానే తీర్చమని, తను అడక్కుండానే అప్పు ఇస్తామన్న వాళ్ళు వున్నారు.

అయినా తను అప్పు తీసుకోవడానికి ఇష్టపడలేదు. అప్పు చేయడానికి తను వ్యతిరేకి. డబ్బు తతీసుకుపోయి ఖర్చు పెట్టుకున్న తరువాత ఉద్యోగం రాకపోతే?

ఒక జత బట్టలు కూడా తీసుకోవాలి. ఇప్పుడు వున్న బట్టలు వేసుకుని ఇంటర్వ్యూకి వెళ్తే ఇవ్వదలుచుకున్న ఉద్యోగాన్ని కూడా ఇవ్వకుండా వెనక్కి పంపిస్తారు.

ఈ మామిడి కాయల సీజన్‌లోనే తను సంపాదించుకోవాలి.

ఉత్తరం చదివి ఆలోచిస్తూనే నిద్రలోనికి జారుకున్నాడు జేమ్స్.

* * *

అవకాశం కుదిరింది. మామిడి కాయల బేరంలో పదిరోజుల్లోనే అనుకున్న డబ్బు సంపాదించి హైదరాబాద్ ప్రయాణమయ్యాడు జేమ్స్.

"జేగర్త నాయనా! పోయిన తరవాత వుత్తరం రాయి. అమ్మాయికి కాన్పు అయిన తరువాత ఒకసారి వచ్చిపో. మొదట్లోనే పెద్దనౌకరీ రమ్మంటే ఎట్ట వచ్చిద్దయ్యా? దొరికిన పని ఏదో చేస్తంటే అదే పెరిగిద్ది!" అని ఎలిశమ్మ, తండ్రి ఏసురత్నం స్టాండ్‌కి వచ్చి, కొడుకుని బస్ ఎక్కిస్తూ జాగ్రత్తలు చెప్పారు.

వెళ్ళిన రోజునుంచీ అన్వేషణలో పడ్డాడు జేమ్స్.

ఇంగ్లీష్ పేపర్లూ, తెలుగు పేపర్లూ అన్నీ తెప్పించి ఉద్యోగ ప్రకటనలు చూస్తూ, ప్రకటన వచ్చిన ప్రతి కంపెనీకీ అప్లయ్ చేస్తున్నాడు.

ఇంటర్వ్యూలు వస్తున్నాయి. వచ్చిన ప్రతి ఇంటర్వ్యూకీ అటెండ్ అవుతున్నాడు.

ప్రతి ఇంటర్వ్యూకీ చేంతాడంత క్యూలు!

"నిరుద్యోగం చాలా తీవ్రంగా వుందిరా చిరంజీవీ! ఏ ఉద్యోగానికి వెళ్ళినా లెక్కలేనంత మంది! ఎంత ఆశగా వచ్చానో అంత నిరాశ ఏర్పడుతోంది!"

"నిరాశ పడితే ఎలారా? నిరాశతో ముందుకు అడుగు వేయలేం. ప్రయత్నించు. దొరక్కుండా పోదు!"

"ఎంత కష్టం అయినా చేయగలన్రా! పని చేస్తానూ అంటే పని లేకపోవడం చూడు! పని లేనంత అభివృద్ధి చెందిందా మన దేశం? ఎన్నో ప్రాజెక్టులు కట్టుకోవచ్చు! ఎన్నో ఇళ్ళు కట్టుకోవచ్చు! ఎన్నో ఫ్యాక్టరీలు కట్టుకోవచ్చు! శ్రమజీవులు వున్నారు. చేసే చేతులు వున్నాయి. మరి ఎందుకు పని లేకుండా పోతోందో అర్థం కావడం లేదు!"

"నువ్వు చెప్పేవన్నీ చేయాలంటే డబ్బు కావద్దూ?"

"డబ్బు ఎక్కడ నించి వస్తుంది?"



"ఏమోరా మనకి తెలియని విషయాలు ఎందుగ్గానీ నీకు టాలెంట్ వుందిరా! నీకు కచ్చితంగా ఉద్యోగం వస్తుంది చూడు!" జేమ్స్‌ని ఉత్సాహపరుస్తూ అన్నాడు చిరంజీవి.

"టేలంటుకీ, వుద్యోగానికీ సంబంధం లేదురా! మా వూళ్ళో ఒకడు తమిళనాడు వెళ్ళి డబ్బు కట్టి ఇంజనీరింగ్ చేసాడు. మేం నైన్త్ చదివేటప్పుడు వాడుటెన్త్ మాకంటే ఒన్ ఇయర్ సీనియర్. వాడు చదువులో పరమమొద్దు. బాగా ఆస్తిపాస్తులు వున్న వాళ్ళులే! వాడు ఇవ్వాళ మంచి పొజిషన్లో వున్నాడు!"

"ప్రైవేట్ కంపెనీ అయినా ఇవ్వాళ రికమెండేషన్ వుండాల్రా! తెల్సిన వాడు వుండి రికమెండ్ చేస్తే కానీ జాబ్ దొరకడం లేదు!"

జేమ్స్ నిరంతర ప్రయత్నంలోనే వున్నాడు. మొదటిసారిగా జేమ్స్‌కి ఒక వింత విషయం అనుభవంలోనికి వచ్చింది.

కులం!

గ్రామాల్లోనే కాదు, నగరాల్లో సైతం కొందరి మనసుల్లో, ఆలోచనల్లో మర్రి వూడలు దిగినట్లు కులం ఎంతగా పాతుకుపోయిందో నెమ్మదిగా తెలుస్తోంది.

కొన్ని కంపెనీల్లో పై స్థాయిలో వున్న వుద్యోగులు కొందరు వాళ్ళ కులం వాళ్ళతోనే కొన్ని వుద్యోగాల్ని నింపేస్తున్నారనే విషయం తెలిసి నిశ్చేష్టుడయ్యాడు.

'మనవాడు'! ఆ 'మన' కుల జాడ్యమే! అంటు వ్యాధే అది!

జేమ్స్ ఇంటర్వ్యూలకి తిరుగుతుంటే ఆ ఇంటర్వ్యూలకే హాజరవుతున్న 'తక్కువ' కులస్తులు కొందరు పరిచయమయ్యారు. వాళ్ళలో సుధీర్ ముఖ్యుడు. సుధీర్‌కి మంచి అనుభవం, పరిశీలన, లోకజ్ఞానం వుందని జేమ్స్ అతని మాటల ద్వారా గ్రహించాడు.

ఒక ఇంటర్వ్యూకి వెళ్ళి తిరిగి వస్తూ సుధీర్ చెప్పాడు "కొన్ని చిన్న కంపెనీల్లో ఎస్‌సిలు ఒక్కరు కూడా వుండరు. అలాంటి కంపెనీలు చాలా వున్నాయి. ఆ కంపెనీల్లో ప్యూనుల్ని కూడా పెద్ద కులం వాళ్ళతోనే నింపేస్తున్నారు. కొన్ని కంపెనీల్లో ఎస్సీలు వున్నా వాళ్ళు బంట్రోతులుగానో, బల్లలు తుడవడానికో, మూటలు మోయడానికో, కాఫీ, టీలు అందించడానికో! అంతే! మంచి పొజిషన్లో ఎస్సీల్ని నియమించిన కంపెనీలు చాలా తక్కువ!"

"ప్రభుత్వ ఉద్యోగాలు కూడా దొరకడం లేదు. మరి చదువుకున్న మనలాంటి వాళ్ళందరం ఏం కావాలి?" అని జేమ్స్ అతన్ని అడిగాడు

"ఏం కావాలంటే? ఎవర్ని అడుగుతావు? ఎవరు బాధ్యత వహిస్తారు ? నిన్ను ఎవరైనా వచ్చి ఇంజనీరింగ్ చదువుకొమ్మని చెప్పారా? నీకు జవాబు చెప్పే వాళ్ళు ఎవరూ లేరు. ఎవరి సమస్యని వాళ్ళు పరిష్కరించుకోవాల్సిందే!" అన్నాడు అతను.

తిరిగాడు. దాదాపు రెండు నెలలు ఉద్యోగం కోసం అవిశ్రాంతంగా తిరిగాడు జేమ్స్.

ఒక కంపెనీలో ఆఫర్ వచ్చింది. జీతం 15 వందలు. ఏడాది పాటు పని చేస్తానని బాండు రాసివ్వమన్నారు. ఈ ఏడాది కాలం సర్టిఫికెట్లు వాళ్ళ దగ్గర వుంచుకుంటామన్నారు. మరో ఉద్యోగానికి ప్రయత్నించే అవకాశం వుండదని జేమ్స్ ఆ ఆఫర్‌ని తిరస్కరించాడు.

రెండు నెలలు జరిగిపోయాయి. తెచ్చిన డబ్బులు అయిపోయాయి.

ఇంతలో ఇంటి దగ్గరనించి ఫోన్. భార్య ప్రసవించింది. కొడుకు పుట్టాడు.

స్వంత వూరికి ప్రయాణమయ్యాడు జేమ్స్.

రూంకి తన వంతు పడిన అద్దె, తిండి ఖర్చు తీసుకోవడానికి చిరంజీవి ససేమిరా కాదన్నాడు.

"నువ్విప్పుడు ఏం ఇవ్వగలవురా? నీకు రేపు మంచి ఉద్యోగం దొరికినప్పుడు డబుల్ పేమెంట్ చేద్దువులే!" అన్నాడు. జేమ్స్ ఉత్త చేతులతో, ఉద్యోగం సాధించకుండా, పని పూర్తికాకుండా నిరాశతో వెనక్కి తిరిగి పోవడం చిరంజీవిని బాధపెట్టింది.

బాధపడుతూనే బస్ దగ్గరికి వచ్చి ఎక్కించాడు. జేమ్స్‌కి కళ్ళంట నీళ్ళే తక్కువ! మనసంతా మౌనరోదనే!

బస్‌లో కూర్చుని జేమ్స్ అనుకున్నాడు. "కోటానుకోట్ల విలువ చేసే పెద్ద పెద్ద ప్రభుత్వ సంస్థల్ని ప్రైవేట్ వాళ్ళకి ధారాదత్తం చేస్తున్నారు. మరి ఉద్యోగాల మాటేమిటి? ఆర్థికంగానూ, సామాజికంగానూ వెనుకబడిన తనలాంటి వాళ్ళకి ఉద్యాగాలు దొరకాలంటే ఎలా ? ప్రయివేట్‌రంగంలోనూ రిజర్వేషన్లు ఉండాలి! ఇక్కడ రిజర్వేషన్లు ఉండాలి! ఇక్కడ రిజర్వేషన్లు ఉంటేనే తనలాంటి వాళ్ళకి న్యాయం జరిగే అవకాశం కొద్దిగా అయినా వుంటుంది! ప్రయివేట్‌లోనూ రిజర్వేషన్ల కోసం తమ జాతి పోరాడాలి! అంతకంటే మరో మార్గం లేదు!"

జేమ్స్ ఆలోచనలు బస్‌తో పాటు అలా సాగుతున్నాయి. ◆

కావ్యేషు నాటకం రమ్యం. కావ్యాలన్నిటికంటే 'నాటకం' రసరమ్యమైనదని దీని అర్థం. ఒకప్పుడు ప్రజా జీవితంలో మమేకమైన తెలుగు 'నాటకం' నేడు సాంస్కృతిక కాలుష్యానికి గురై యాంత్రికంగా మనుగడను సాగిస్తోంది. సమాజాన్ని ప్రభావితం చేసే నాటకాల స్థానే బారులు 'బారు'లుగా డిస్కోథెక్‌లు తన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. తెలుగు నాటకం సత్తాను నలుదిశలా చాటిన కన్యాశుల్కం, మరో మొహంజదారో కాలం నాటి రోజులు మళ్లీ రావాలి. సినిమా టిక్కెట్‌లో మూడవ వంతైనా ఖర్చుపెట్టి ప్రజలు నాటకాన్ని చూడగలగాలి. ఇదే రంగస్థల, నాటకరంగ కళాకారుల మనోవేదన.

కొత్త ఊపిరినింపిన 'రఘుబాబు నాటకోత్సవాలు'

నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న టూరిజమ్ శాఖ మంత్రి తలసాని



ప్రారంభోత్సవ నాటిక 'ఆకాశంలో సగం'లోని సన్నివేశం

నిత్య ప్రదర్శనలతో శోభిల్లిన తెలుగు నాటకం మళ్లీ వికసించాలి. పాశ్చాత్య సంస్కృతిని తరిమికొట్టే దిశగా రసజ్ఞులంతా ఉద్యమించాలి. నాటకాన్నే నమ్ముకొని జీవిస్తున్న కళాకారులకు నాటక పరిషత్‌లు దోహదపడాలి. ప్రభుత్వం అరకొర కార్యక్రమాలతో చేతులు దులిపేసుకుంటున్నా కళాకారుల శ్రేయస్సు, ఉషస్సుకోరుతూ పలు సంస్థలు తమ తమ వార్షిక కార్యక్రమాలతో కళాకారులకు అండగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పదమూడేళ్ళ క్రితం వెలసిన రఘుబాబు నాటకోత్సవాలు దినదిన ప్రవర్ధమానమవుతూ అటు కళాకారుల, ఇటు కళాప్రియుల ఆదరాభిమానాలను చూరగొంటున్నాయి. వాల్మీకి శోకం శ్లోకం అయింది. మా శోకం రఘుబాబు స్మారక నాటకోత్సవాలుగా రూపుదిద్దుకొని ఎందరో కళాకారుల ప్రతిభా పాటవాలకు వేదికయ్యిందంటూ పరుచూరి సోదరులు యజ్ఞతుల్యంగా చేపట్టిన 'రఘుబాబు స్మారక పదమూడవ అఖిల భారత నాటకోత్సవాలు' వైభవంగా ముగిశాయి. ఏప్రియల్ 27నుంచి మే 1 వరకు రాష్ట్రవ్యాపిత కళాకారుల సమ్మేళనంతో అటు సినీ, ఇటు రంగస్థల, నాటక ప్రముఖుల తోడ్పాటుతో సాగిన ఈ ప్రదర్శనల్లో సుమారు డెబ్బై శాతం గత రెండు మూడు సంవత్సరాల్లో వివిధ పోటీ నాటకోత్సవాల్లో ప్రదర్శించినవే. దీనితో కొత్త నాటకాలు చూడాలనుకున్న ప్రేక్షకులకు కాస్త నిరాశ ఎదురయ్యింది. బహుశా సంతృప్తికరమైన కథా వస్తువుగల కొత్త నాటకాలు పోటీకి రాకపోవడం ఈ వెలితికి కారణం కావచ్చు. లక్షలాది రూపాయల నిర్వహణ వ్యయంతో రాష్ట్రంలో 'నంది'కి ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న పరుచూరి రఘుబాబు నాటకోత్సవాలకు మరింత ప్రామాణికత కలిగిన నాటిక, నాటకాలను అందించ వలసిన బాధ్యత నిర్వాహకులకంటే నాటక రచయిత, దర్శకులకే ఉందన్నది కొంతమంది అభిప్రాయం. పరుచూరి సోదరుల సుదీర్ఘ కృషికి నిదర్శనంగా ప్రేక్షకాదరణ మెండుగా పెంచుకుంటున్న రఘుబాబు నాటకోత్సవాల్లాంటి నాటక పరిషత్ సంస్థల వార్షిక ప్రదర్శనలకు ప్రభుత్వం ప్రదర్శనా వేదికలు ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తే మరిన్ని కళాపరిషత్‌లు ముందుకు వచ్చి పోటీలను నిర్వహించగలుగుతాయి. కళాకారులకు మరింత నగదు ప్రోత్సాహకాన్ని ఇవ్వగలుగుతాయి.

మళ్ళీ 'ఉత్తమ పంచాయితీ'యే ది బెస్ట్

మూడు రాష్ట్రాలనుంచి వచ్చిన 70 నాటికలు, 30 నాటకాల ఎంట్రీలలో ఎన్నికచేసిన 16 నాటికలు, 5 నాటకాలు తుది ప్రదర్శనకు అర్హత సాధించాయి. గత మూడేళ్ళనుండి వివిధ నాటకోత్సవాల్లో ఉత్తమ ప్రదర్శనగా నిలుస్తున్న ఎల్.వి.ఆర్ క్రియేషన్స్(గుంటూరు) వారి 'ఉత్తమ పంచాయితీ' నాటకం ఉత్తమ నాటకంగా ఎన్నికై 12,000 రూపాయల నగదు బహుమతిని, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ విలన్, బెస్ట్ కమెడియన్, బెస్ట్ ఏక్టర్ అవార్డులను దక్కించుకుంది. నాటకం విభాగంలో గురజాడ కళామందిర్(విజయవాడ) 'శబ్దం' నాటకం ద్వితీయ ఉత్తమ నాటకంగా నిలిచింది. నాటికల్లో సద్గతి, గుండెచప్పుడు నాటికలు ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నాయి. కథాబలంతో పాటు వేలాది రూపాయలు వెచ్చించి రంగాలంకరణకు ప్రాధాన్యతనిచ్చిన 'ఉత్తమపంచాయతీ' నాటకంలా మా నాటకాలను రూపొందించుకోవడానికి మా ఆర్థిక స్తోమత సహకరించదని కొంతమంది నాటక సమాజాలవారు వాపోవడం గమనార్హం. నాటకరంగం ఇప్పుడిప్పుడే తిరిగి ఊపిరిపోసుకుంటున్న తరుణంలో భారీ వ్యయంతో ప్రదర్శితమయిన నాటకం ఉత్తమంగా నిలపడంతో చిన్న నాటకాల వారు ఒకింత నిరాశకు గురయ్యారు

*** గంగాధర్ వీర్ల**

రాజకీయ వ్యంగ్య వ్యాసాలు

మన తెలుగు సాహిత్యంలో హాస్య, వ్యంగ్య రచనలకు కొరత ఎప్పటి నుంచో



జనాంతకం
రచన : బుద్ధా మురళి
ప్రచురణ : ప్రోగ్రెసివ్ కమ్యూనికేషన్, హైదరాబాద్ - 35; **వెల :** రు.50/-
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

వుంది. ఇక రాజకీయ వ్యంగ్య రచనలను వేళ్లమీదనే లెక్కబెట్టుకోవాల్సి వస్తుంది. చలసాని ప్రసాదరావు, ధర్మారావు, ఎం.వి.ఆర్.శాస్త్రి లాంటివాళ్ళు రాజకీయ వ్యంగ్య రచనల్లో తమదైన సరికొత్త బాణిని నెలకొల్పారు. వీళ్ళంత తీవ్రంగా, ఘాటుగా కాకుండా సుతిమెత్తని వ్యంగ్యంతో, సున్నితమైన హాస్యంతో బుద్ధా మురళి తన రచనలతో ఆకట్టుకున్నారు.

ప్రతి శుక్రవారం 'ఆంధ్రభూమి' దినపత్రికలో 'జనాంతకం' శీర్షికన బుద్ధా మురళి రాసిన రాజకీయ వ్యంగ్య రచనలను ఇలా పుస్తకరూపంలో తీసుకురావడం ఆహ్వానించదగినదే. సమకాలీన రాజకీయాలను ప్రధానంగా చేసుకొని వ్యంగ్యంగా విమర్శించడమే ఈ శీర్షిక పని. ఇందులోని ఎక్కువ భాగం వ్యాసాలు రాష్ట్ర రాజకీయాలను విమర్శించేవే. తెలుగుదేశం పార్టీ నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీదే ఎక్కువ వ్యాసాలు వచ్చాయి. ప్రభుత్వమే వన్‌మాన్‌షోగా మారినప్పుడు అది సహజమే కదా! ఇందులో చంద్రబాబు నాయుడి వెన్నుపోటుతో ఆయనకు పట్టిన అదృష్టం మొదలుకొని 'దయల్ యువర్ సి.ఎం.' వరకు ఆయన ఎదిగిన దశల పరిణామ క్రమాన్ని వివరించారు. లక్ష్మీపార్వతి నడిపిన 'కిచెన్‌పాలిటిక్స్' నుండి నారా రామ్మూర్తి - చంద్రబాబుల యుద్ధం వరకు గల పరిస్థితులను విశ్లేషించారు. గడ్డమే చంద్రబాబు పదవికి శ్రీరామరక్ష అనీ, నవ్వని చంద్రబాబు లాఫింగ్ థియరీ లాంటి వ్యక్తిత్వ విశేషాలను ఆసక్తిగా, హాస్యయుతంగా తెలియజేశారు. ప్రతిపక్ష నాయకుడైన రాజశేఖర్‌రెడ్డిపై వేసిన చురకలతో పాటు వెంకయ్యనాయుడు, ఇతర పార్టీల వైఖరిని కూడా ఎండగట్టారు. వాజ్‌పేయి ద్వంద్వ ప్రవృత్తి గురించి చెప్పినా, ఆయన అసమర్థతను చెప్పినా, బాంబే వీధుల్లో పెల్లుబికిన నరేంద్రమోడి ఆరాధనా విషయాలను తెలియజేసినా అదే నిష్పక్షపాత ధోరణి కనిపిస్తుంది. ఇవికాకుండా ఖాకీహింస, పేటెంట్లు, పబ్లిక్ ఇష్యూలు, వాస్తు మొదలైన అంశాలను కూడా వ్యంగ్యంగా విమర్శించడాన్ని మనం చూడవచ్చు. మన వాళ్ళను, మన భాష-సంస్కృతులను పట్టించుకోని మనం ఎన్.ఆర్.ఐ.లకు, ఇతరులకు ఇచ్చే ప్రాముఖ్యాన్ని నిరసించడం కూడా ఇందులో కనిపిస్తుంది. గద్దర్, వరవరరావులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన 'చర్చల'ను, 'దయల్ యువర్ సి.ఎం.'ను మంచి హాస్య కార్యక్రమంగా నిరూపించిన తీరు అద్భుతం.

బుద్ధా మురళి వ్యంగ్యాన్ని చాలా నేర్పుగా, ఇతరులను నొప్పించని విధంగా రూపొందించుకున్న విధానం బాగుంది. చెప్పదల్చుకున్న విషయాన్ని పురాణ పాత్రలతో, సమకాలీన ఉదాహరణలతో పోలుస్తూ వివరిదాకా ఆ అంశాన్ని బిగి సడలనివ్వకుండా మలచిన తీరు అద్వితీయం. రాజకీయ పార్టీలు, నాయకుల పట్ల పక్షపాత ధోరణిని అవలంబించకపోవడం ప్రశంసనీయం. అద్భుతమైన రీడబులిటీతో హాయిగా చదివింప చేసే ఈ పుస్తకం మనల్ని ఆలోచింప చేస్తుంది. ముఖచిత్రంతో పాటు మృత్యుంజయ ఈ పుస్తకం లోపల చేసిన కార్టూన్‌లు ఈ పుస్తకాన్ని హైలెట్ చేస్తాయి.

❊కె.పి.అశోక్ కుమార్

స్వీకారం

మౌనంతో మాటలు
రచన : డి.విజయభాస్కర్; **వెల :** రు.30/-
ప్రతులకు : శ్రీమతి డి.గౌరీదేవి, 238/2ఆర్‌టి. 2వ అంతస్తు, విజయనగర్ కాలనీ, హైదరాబాద్; విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, అన్ని బ్రాంచీలు



తెమ్మెర కథాసంకలనం

సాహితీ తరంగాలు
సంపాదకుడు : డా॥ టి.శ్రీరంగస్వామి; వెల : రు.60/- ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్; శ్రీలేఖ సాహితి, హెచ్.నెం.5-11-481, విద్యారణ్యపురి, హన్మకొండ, వరంగల్

తిరిగివచ్చిన వసంతం

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

తల్లి శారదమ్మ ఫొటోకు దండవేసి దణ్ణం పెట్టుకున్నాడు ఉమేష్. భౌతికంగా ఆమె లేకపోయినా ఆమె జ్ఞాపకాలు ఉమేష్‌కు గొప్ప ఉత్తేజాన్ని ఇస్తాయి. అందుకే ఏ పని చేయాలని అనుకున్నా ఆమెను తలచుకోకుండా చేయడు.

పద్నాలుగేళ్ళ ఉమేష్ ఒంటరివాడు. అందరూ ఉన్నా ఎవరూ లేని అనాథ. అందుకే తన కాళ్ళమీద తను నిలబడాలని నిశ్చయించుకున్నాడు.

ఆ సమయంలో తనని వదిలిపెట్టిన

మళ్ళీ విద్యార్థిగా మారిన ఉమేష్

తండ్రి విఘ్నేశ్వర నాయక్ గుర్తు రాలేదు. తండ్రిగా బాధ్యతలు తీసుకొని తన తండ్రి వంటి వ్యక్తుల్ని గుర్తుకు తెచ్చుకోవడానికి అతని మనస్సు అంగీకరించలేదు.

హాస్టల్‌లో ఉన్న తన అక్క చదువు ఆగిపోకూడదని అనుకున్నాడు. అందుకే అనంత లోకాల్లోకి వెళ్ళిపోయిన అమ్మను ఒకసారి ప్రార్థించుకున్నాడు.

ముందురోజు రాత్రి రు.75 వెచ్చించి కొన్న ఫ్లాస్కును భుజాన తగిలించుకున్నాడు. దగ్గరగా ఉన్న హోటల్‌కు వెళ్ళి అరువుమీద ఫ్లాస్కులో కాఫీ పోయించుకొని మూత బిగించాడు.

మొదటిసారి ప్రారంభించిన కొత్త వ్యాపారం విజయవంతం కావాలని మనస్సులోనే అమ్మ ఆశీర్వాదాన్ని కోరుకున్నాడు ఉమేష్.

కర్నాటక రాష్ట్రంలో దావణగెరె వీధుల్లో 'కాఫీ కాఫీ' అంటూ బయలుదేరాడు.

* * *

పొదరింటిలో చీకూచింతాలేని గువ్వపిట్టలాంటి జీవితాన్ని గడుపుతున్న ఉమేష్ జీవితం ఒక్కసారి తలకిందులైంది. అప్యాయంగా చూసుకునే అమ్మ, అవసరాలు తీర్చే నాన్న, ఆటలాడుకునే అక్క తమ్ముళ్ళ మధ్య ఆనందంగా గడిచిపోతున్న బతుకును ఓ ప్రమాదం తారుమారు చేసింది.

1998లో బస్సులో ప్రయాణిస్తున్న ఉమేష్ కుటుంబం ప్రమాదానికి గురైంది. చిత్రదుర్గం పుష్కరిణిలో బస్సు బోల్తాపడటంతో ఉమేష్ తల్లి శారదమ్మ, తమ్ముడు యంకా నాయక్ మృతి చెందారు. తండ్రి విఘ్నేశ్వర నాయక్, అక్క విజయలక్ష్మి, ఉమేష్ మాత్రం బతికి బైటపడ్డారు.

భార్యాబిడ్డలు దూరమయ్యారన్న వ్యథ కన్నా తన అవసరాలకే ప్రాధాన్యమిచ్చి నెల తిరిగేసరికి మరొకర్ని వివాహం చేసుకుని విఘ్నేశ్వర నాయక్ మరో ఊరు వెళ్ళిపోయాడు.

ఏడవ తరగతిలో 600 మార్కులకు 502 మార్కులు సంపాదించి తెలివైన విద్యార్థిగా ఉన్న ఉమేష్ జీవితం దీంతో కొత్త మలుపు తిరిగింది. చదువు కొండెక్కింది. ఇంటి బరువు బాధ్యతలను మోయవలసి వచ్చింది.

కొంతకాలం బస్సుల్లో పల్లీలను అమ్మేవాడు. అది గిట్టుబాటు కాకపోవడంతో దావణగెరెలో ఒక బార్‌లో పనికి కుదిరాడు. అది కూడా నచ్చక మానివేశాడు.

అక్కను చిత్రదుర్గంలో బాలికల హాస్టల్‌లో చేర్పించి కాఫీ అమ్మడానికి కుదిరాడు. రోజుకు రు.150 అమ్మితే అందులో రు.25 మిగిలేది. రోజూ తెల్లవారుజామున బయలుదేరి ఏ రాత్రికో ఇంటికి చేరేవాడు.

వచ్చిన డబ్బులు కొంత మిగుల్చుకుని



ఉమేష్ కష్ట సుఖాలను అడుగుతున్న దావణగెరె అధికారి శివరాం

మిగిలినది అక్క చదువు కోసం వినియోగించే వాడు. అప్పుడప్పుడు తాతగారి ఊరు కాళయెట్టకు వెళ్ళేవారు.

బాలకార్మికుడిగా మారిపోయిన ఉమేష్ జీవితం ఓ అధికారి పరిచయంతో మలుపు తిరిగింది.

* * *

దావణగెరె జిల్లా అధికారి కె.శివరామ్‌ను కాఫీ అమ్ముతున్న ఉమేష్ అనుకోకుండా కలుసుకున్నాడు. చదువుకునే వయస్సులో కాఫీ ఎందుకు అమ్ముతున్నావని అడిగిన ప్రశ్నకు మొత్తం విషయమంతా ఏకరువు పెట్టాడు.

ఆయన మనసు కరిగిపోయింది.

తెలివైన విద్యార్థి ఉండవలసింది పాఠశాలలోనే అని గుర్తించారు. అనాథ పిల్లల కోసం నిర్వహిస్తున్న 'డాన్‌బాస్కో శరణాలయం'లో చేర్పించారు. బట్టలు, చదువుకు కావలసిన పుస్తకాలు అవసరానికి ఐదువేల రూపాయలు సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేయించారు. బాగా చదువుకోవాలని శివరామ్ చెప్పిన మాటలు ఉమేష్‌లో చైతన్యాన్ని తీసుకువచ్చాయి.

* * *

అనాథ బాలునిగా అష్టకష్టాలు పడుతున్న ఉమేష్ రేపటి కలలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు.

డాక్టర్ కావాలన్న తన ఆశయానికి అనుగుణంగా అడుగులు ముందుకు వేస్తున్నాడు.

ఉదయాన్నే అమ్మ ఫొటోకు దణ్ణం పెట్టకుండా ఏ పనీ ప్రారంభించని ఉమేష్ ఇప్పుడు అమ్మ ఫొటో పక్క శివరామ్ ఫొటోను కూడా చేర్చాడు. తన జీవితాన్ని మలుపు తిప్పిన ఆయన్ని కూడా అమ్మతో బాటు పూజిస్తున్నాడు. ◆

ఆషాఢభూతి...

✻ కొండబాబు

"సుబ్బారావ్..."

''సార్'' అంటూ మరుక్షణం ప్రత్యక్షమయ్యాడు సుబ్బారావు.

తన టేబులుకు ఎదురుగా నిలుచున్న సుబ్బారావును అసహనంగా చూశాడు ఆఫీసరు వెంకటేశం.

''నేను మిమ్మల్ని రమ్మనలేదండీ''అన్నాడు అసహనాన్ని ఆపుకుంటూ మెల్లగా.

"సార్..." అన్నాడు సుబ్బారావు.. ఇంకా ఏం చెప్తారా అన్నట్లు చూస్తూ.

''ఒక విషయం చెపుదామని మిమ్మల్ని పేరుతో అలర్ట్ చేశా."

"సార్..."

ఎందుకండీ అన్నిసార్లు సార్... సార్... అంటారు.... సార్స్... అంత భయంగా ఉందా వినయం..." ఆపుకోలేక అనేశాడు వెంకటేశం.

"స్సార్..." అలవాటుగా అనేసి నాలుక్కరుచుకున్నాడు సుబ్బారావు.

"మనిద్దరి టేబుళ్ళ మధ్య పదడుగుల దూరం కూడా లేదు... ఏదో చెపుదామని మిమ్మల్ని సంబోధించగానే పరుగెత్తుకొచ్చేస్తారు.. అలారాకు... నాకు చిరాకు..."

''సరే సార్...'' అంటూ వెళ్ళిపోయాడు. పావుగంట కూడా గడవకుండానే మళ్ళీ వచ్చాడు "సార్..." అంటూ.

"కూర్చోండి... ఏమిటి?'' అడిగాడు వెంకటేశం.

"హెడ్డాఫీసు పంపాల్సిన కొరియర్‌లో మంత్లీ రిపోర్టు కూడా పెట్టమంటారా?"

"పెట్టండి.. ఆ విషయం అడగడానికి రావడమెందుకండి.. కొంచెం లౌడ్‌గా చెప్పినా సరిపోతుంది. లేదా ఇంటర్‌కమ్‌లో మాట్లాడొచ్చు కదా!

"సార్..." అన్నాడు సుబ్బారావు ఇబ్బందిగా చూస్తూ...

సుబ్బారావును వెంకటేశం కొద్దిరోజులుగా గమనిస్తున్నాడు. ఇక ఆపుకోలేక అనేశాడు. "నేను మీ పై అధికారిగా కాదు. కొలీగ్‌గా చెపుతున్నాను. పని విషయాల్లో సమాచార వ్యవస్థనూ, సిబ్బందినీ ఉపయోగించండి.. మీరే వస్తే తప్పు కుదరదనుకున్నప్పుడే రండి. లేదా మీకు ఖాళీ దొరికి నేనూ ఖాళీగా ఉంటే క్యాజువల్‌గా ఫ్రెండ్లీగా మాట్లాడ్డానికి రండి... ఇకపై! ఈ అతి వినయం..., ఆషాఢభూతి వ్యవహారాలను వదుల్చుకుందాం".

"పాత ఆఫీసరుకు భిన్నంగా ఉన్నాడేమిటి

చెప్మా" అనుకుంటూ "సార్... అలాగే సార్" అనేశాడు సుబ్బారావు.

* * *

ఇలాంటి సుబ్బారావులు, వీరిని మించిన కాకారావులూ చాలా చోట్ల ఉంటారు. వారి సంగతి మనకొద్దుగానీ, ఆఫీసరు వెంకటేశం వాడిన 'ఆషాఢభూతి' ఎవడో తెలుసుకొందాం.

"వాడా! వాడొక ఆషాఢభూతి" చప్పరించే వ్యాఖ్యానాలను అప్పుడప్పుడూ అక్కడక్కడా వింటుంటాం. చదువుతుంటాం. ఇది శిష్టవ్యావహారికుల మాటల్లో ఎక్కువగా దొర్లే అవకాశముంది. అసలు ఆషాఢభూతి అంటే అర్థమేమిటి?

అతి వినయం, అతి నిజాయితీ ప్రదర్శిస్తూ, ఆచరణలో... వాటికి భిన్నంగా వ్యవహరించే వారిని ఆషాఢభూతి అంటారు.

అసలు ఈ ఆషాఢభూతి ఎవరు ? ఇందరు ఆధునిక ఆషాఢభూతులకు ఆద్యుడెలా అయ్యాడు అనేది ఆసక్తిదాయకమైన కథ. నిజంగా కథే.

పూర్వం ఒక స్వాముల వారు ఉండేవారు. ఆయనకు ఆధ్యాత్మిక విషయాలతో పాటు ఆర్జన కూడా సమాంతర వ్యాపకంగా ఉండేది. అంటే భక్తులిచ్చే కాసులు, కానుకల పట్ల ఇప్పటి స్వాములవార్లలాగే పిసరంత ఆసక్తి జాస్తిగా ఉండేది. వచ్చిన సొమ్మును బొంతలో భద్రపరిచేవాడు. అది చూసి ఒక కుర్రాడు ఆయన శిష్యరికం కోరి వచ్చాడు. ఇతరులు చెపితేనే మన గొప్ప మా బాగా సొమ్మవుతుందని భావించిన స్వాముల వారు అందుకు ఈ కుర్రాడు సరిపోతాడని ఎంచి శిష్యుడిగా స్వీకరించారు.

ఆ విధంగా.. ఒకరోజు ఒక ఇంటి ఆతిధ్యం స్వీకరించి బయలుదేరారు. కొంతదూరం వచ్చాక, శిష్యుడు "అయ్యయ్యో గురువుగారూ... మనకు ఆతిధ్యం ఇచ్చిన ఇంటివారి పూచిక పుల్ల నా వస్త్రానికి తగిలి వచ్చింది. ఇచ్చి వస్తాను" అంటూ వెనక్కు పరుగు తీశాడు.

"ఆహాఁ నా శిష్యుడు ఎంత నిజాయితీపరుడు, నా బోధలు బాగా తలకెక్కుతున్నాయి" అనుకున్నాడు గురువుగారు.

కొంతసేపటికి తిరిగొచ్చిన శిష్యుడితో "నాయనా ఈ బొంత జాగ్రత్తగా ఉంచు... నేను స్నానం చేసి వస్తాను" అని చెప్పి ఒక కొలనులోకి దిగాడు. స్నానం చేసి వచ్చేసరికి శిష్యుడు లేడు. బొంతా లేదు.

"అరెఁ ఆషాఢభూతి" అనుకున్నాడు గురువుగారు. ఆ శిష్యుడి పేరు ఆషాఢభూతి మరి. పురాణాల్లోని ఓ పిట్ట కథ ఇది. ఇందులోని ఆషాఢభూతి పేరు జాతీయమై నిలిచింది చూశారా! ◆

పాఠక స్పందన

కవర్ స్టోరీ బాగుంది

4వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్‌స్టోరీ చాలా బాగుంది. మిగతా శీర్షికలు కూడా బాగున్నాయి.

-క్రాంతి, మానుకొండవారిపాలెం, గుంటూరు జిల్లా

మనస్సును కదలించిన కథ

4వ తేదీ ఆదివారం అనుబంధంలో రియల్ స్టోరీ ప్రచురించిన 'మృత్యుంజయుడు' నా మనస్సును కదిలించింది. ఇలాంటివి ఈ ప్రపంచంలో ఎన్నో జరుగుతూ ఉంటాయి. అసలా ఊళ్ళో వైద్య సదుపాయాలుంటే ఇలా జరిగేది కాదు. ఏదిఏమైనా శంకర్ మృత్యుంజయుడైన 15 ఏళ్ళ సుదీర్ఘ విరామం తరువాత తన తల్లిని, చెల్లిని కలుసుకోవడం ఆనందదాయకం

-పెట్లోజు ప్రవరేశ్వర్, వరుణేశ్వర్, పాలకుర్తి, వరంగల్

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

మంచి వ్యాసం

4వ తేదీ ఆదివారం అనుబంధంలో టూరిస్ట్ గైడ్ శీర్షికన ప్రచురించిన 'మద్దులేటి క్షేత్రం' వ్యాసం మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. రచయితకు అభినందనలు.

-పుట్టా శ్రీనివాసరావు, లక్కవరపుకోట, విజయనగరం.

కథ అగమ్యగోచరం

మే 4వ తేదీ సంచికలో ప్రచురించిన కథ బాగుండలేదు. రచయిత ఏమి చెప్పదలచుకున్నారో మాకైతే అర్థం కాలేదు. ఇకముందు ఇలాంటి కథలు ప్రచురించకుండా వుంటారని ఆశిస్తున్నాము.

- మహేష్ కుమార్, కాకినాడ